# ముగ్ధ

వాసు ఉత్తరం వ్రాశాడు — ఫలాని వూళ్ళో తనకి పెళ్ళి ... భార్యాపుత్ర సమేతంగా నాల్రోజులు ముందుగా రమ్మని మరీ మరీ వ్రాసాడు. వెధవ! నాల్రోజులు ముందే అని వ్రాసేడుగాని నెల్రోజులు ముందే వెళ్ళి కూర్చుందును మా ఆఫీసరు సెలవంటూ ఇస్తే. ఇంత ఫ్రెండయ్యిండీ నాల్రోజులు ముందు మాత్రమే రమ్మంటాడా... అని తిట్టుకున్నా తీరా సెలవుకోసం ఆఫీసరు దగ్గరకి వెళ్ళాలనేసరికి నాలుగు రోజులు సెలవు కావాలని చెప్పడానికి నోరు పెగులుతుందో లేదో.

ముందు మా హోమ్ ఆఫీసరుగారి నడగాలి కదా. ఆవేళ రాత్రి కదిపాను... ఏ కళనుందోగాని ఆవిడగారు ఒప్పుకుంది. అవును మరి నాకయితే తెల్లవారితే... షేవింగూ... స్నానం... బజారూ...భోజనవూ... ఆఫీసూ... కాఫీ... షికారూ... భోజనం ... నిద్రా. ఆవిడకయితే తెల్లవారితే... చిన్నదాని ముక్కు చీమిడి తుడవటం దగ్గర్నుండీ... పెద్దాడిని బళ్ళోకి పంపటం... నన్నాఫీసుకు పంపటం వంటా వార్పులు చూసుకోవటం... ఇద్దరి పిల్లల అల్లరి ఆపటం... ఇద్దరు పిల్లల్ని మించిన నా అలకలు తీర్చటం... ఒహటా ఈరొటీన్‌తో మరో వ్యాపకమే లేకుండా జీవితమే విసుగ్గా ఉంటోంది యీ మధ్య.అలాంటి సమయంలో వాసు ఉత్తరం... అందులోనూ నేనొకప్పుడు పన్జేసిన ఊరు మళ్ళా చాన్నాళ్ళకు వెళ్తున్నాననుకుంటూంటే... ఊరెలా మారిందో... నేను పన్జేసిన స్కూలెలా ఉందో... నేనుండే రూమ్ ఎలావుందో అంటూ ఉత్సాహం పొంగుకు వస్తోంది. జాలీట్రిప్‌ను ఈస్ట్‌మన్‌కలర్‌లో

ఊహించుకున్నాను. నా కలలు నిజం చేయడానికా అన్నట్లు మా ఆవిడ కూడా ఒప్పుకుంది వెంటనే.

పెద్దవాడికి అవసరమైన కాషన్స్ ఇచ్చేను. చిన్నదానికి అవసర మైన సామాను సర్దేను. రెండ్రోజులు ముందు బయలుదేరేను మా ఆవిడతో సహా.

దిగగానే వాసు ఆప్యాయంగా ఆహ్వానించాడు. తనతోటివాడి నైనా నేనప్పుడే ఇద్దరు పిల్లల తండ్రినయితే, తానింకా బాలా కుమారు డిలా ఇప్పుడు పెళ్ళి చేసుకుంటున్నందుక్కాబోలు మాటిమాటికి నా కుటుంబాన్ని చూసి ముసిముసి నవ్వులు నవ్వుతున్నాడు. నా మాటకేం గాని మా ఆవిడకీ పిల్లలకీ ఆ విడిదిలోనే ఓ గది కేటాయించి సదు పాయాలన్నీ జరిగేలా ఏర్పాటు చేసాడు.

కాఫీలవీ తాగిం తర్వాత తీరిగ్గా కూర్చున్నాం యిద్దరమూ పెళ్ళి కొడుకు గదిలో. 'అయితే ఎంతకిరా అమ్ముడు పోతున్నావ్ ?' అనడిగా.

'ఓ బంగారమ్ముద్దకి' అన్నాడు వాడు.

'ఓరి నీ అసాధ్యంకూలా ... పెళ్ళి చేసుకుంటున్నావనేసరికి పెద్ద మాటలుకూడా వచ్చేసాయేం ?' అన్నా... 'సరేగాని అమ్మా యెలా వుంటుందిరా ?'

'చెప్పేను కదురా బంగారు బొమ్మని .. అమ్మాయి మాటకేం గాని బ్రదరూ .. ఆ అమ్మాయివాళ్ళక్క వుంటుంది .. నిజంగా అప్సరసే అనుకో ...'

ఇంకా ఏదేదో చెప్పబోతున్నాడు వాడు... 'ఒరేఒరే ... అదేమి టిరా ? మీ వదినగారి మీద పడిందేవిటీ కన్ను ? తప్పు' అన్నా.

'ప్చ్... చెప్పేది వినరా. అసలు పెద్దమ్మాయినే అడిగాం. కాని ఒప్పుకోలేదు. ఒప్పుకోనిది ఎవరనుకున్నావ్ ? ఆ అమ్మాయే. వాళ్ళ అమ్మా నాన్నా నెత్తీ నోరూ బాదుకున్నారు అలా ఖచ్చితంగా చెప్పేసి నందుకు ...'

'అవును పాపం... ఎవర్నో ప్రేమించి వుంటుంది. పోనీ అతని పేరేమైనా చెప్పిందా ? అతన్నే పెళ్ళి చేసుకుంటానని పట్టు పట్టిందా ?' ఉత్సాహంగా అడిగాను.

'పప్పులో కాలేసావ్. ఏవీ చెప్పలేదుట. నేను పెళ్ళి చేసుకోనూ... చెల్లాయికి చేసేయండి అందిట. తరువాత ఆ అమ్మాయి నొక ఇంటి దాన్ని చేద్దావని తల్లిదండ్రీ ఎంతో ప్రయత్నించారుట.

'ఏమో ... ఇంతకు ముందెవర్నో ప్రేమించి .. కాలు జారితే తల్లిదండ్రులిలా కట్టు కథ అల్లుతున్నారేమో బ్రదర్...' నా మనస్సు నాకే సంకుచితం అనిపించింది ఒకింత సేపు.

'ఛఛ... అలాంటి దేవీ కాదురా. అసలు ఆ అమ్మాయి గడప దాటి ఇవతలికి రాగా చూసినవాళ్లు లేరని అమ్మా నాన్నా కనుక్కోగా తెలిసిందిట.'

అసాధ్యుడే ! అంటే ఆ అమ్మాయినే ఎలాగైనా చేసుకుందామని అనుకుని చాలా ప్రయత్నించి ఉంటాడు వాసు. నేను చెప్పింది కాక పోయినందుకు ఉత్సాహం తగ్గినా, ఆ అమ్మాయి సంగతి చాలా విచి త్రంగా కన్పించింది. 'ఛీఛీ ఏం పెళ్ళి' అన్న గడసరి ఆడపిల్లలే చక్కా సంసారాలు దిద్దుకుంటున్నారు. మరి ఈ అమ్మా యేమిటి ?

సాయంకాలం... వాళ్ళ నాన్నగారు పలకరించారు. అంతవరకూ పెళ్ళి పనుల్లో హడావుడిగావుండి అప్పుడే తీరిక చిక్కినట్టుంది.

'ఏం బాబూ ... వచ్చావా ? అమ్మాయినీ, పిల్లల్నీ కూడా తీసు కొచ్చావా లేదా ?' అనడిగారు పలకరింపుగా.

'వచ్చారండీ బాబాయ్...' అనిచెప్పి గట్టిగా 'బాబూ' అంటూ కేకేసాను. పెద్దాడు వచ్చాడు. 'ఏవిరా తాతయ్యా ... చాలా పెద్దాడి వై పోయావురోయ్ ...' అంటూ దగ్గరకి తీసుకున్నారాయన.

వెధవకి ... బయలుదేరినప్పుడే కాషన్స్ ఇచ్చానే ... మామిడి పండు తింటూ తింటూ ఆయన తెల్లని చొక్కానిండా పులిమేస్తున్నాడు.

'అరెరె ... వెధవా ... దిగు. మామిడిపండు తింటూ తాతగారిమీద కెందుకురా వెళ్ళావ్ ?' అని గట్టిగా కేకలేస్తే ...

'పోన్లే బాబూ ... పిల్లాడు ...' అంటున్నారాయన.

'అసలు, భోజనం ముందెవర్రా నిన్ను తినమన్నారు?' అంటూ జబ్బ పట్టుకున్నాను. 'పిన్ని ఇచ్చింది' గారంగా దీర్ఘం తీసాడు.

'పిన్నెవర్రా ?' కోపం అంతాపోయి ఆశ్చర్యంగా అడిగాను. వాసు తండ్రిగారు కూడా ముచ్చటగా చూస్తున్నారు. 'పిన్నంటే పిన్నే ...పిన్నే చెప్పింది పిన్నినని — అమ్మ కూడా పిన్నిని పిన్ని అనే పిలవమంది' అన్నాడు వాడు.

'సర్లే. మొత్తంమీద పిన్నిపిన్ని అంటూ ఫ్రెండ్‌షిప్ చేసావ్. వెళ్ళి చెయ్యి కడుక్కో' అంటూ పంపించేసాను.

'రా బాబూ కడుగుతాను.' అంటూ నన్నని గొంతు విన్పించింది గాని శాల్తీ కనిపించలేదు. 'ఓహ్హో—భానుమతా! మంచి పరనే కని పెట్టాడు తాతయ్యా—' అంటూ అంతవరకూ ఆశ్చర్యంగా చూస్తున్న వాసు తండ్రిగారు పకపక నవ్వడం మొదలెట్టారు.

'భానుమతెవరండి ?' అనడిగా ఉత్సుకతతో,

'నీ పెద్ద మరదలు బాబూ' అన్నారు. నాకు మరదలెవరున్నా రబ్బా అని ఆలోచిస్తూ ప్రశ్నార్థకంగా ఆయన ప్రక్క చూసాను.

'వాసుకి ఒదినగారు. అంటే పెళ్ళి కూతురు వాళ్ళ అక్క. అసలు ఆ అమ్మాయినే ఇద్దామనుకున్నాం వాసుకి. పెళ్ళే వద్దని కూర్చోవటం వల్ల రెండో అమ్మాయిని కుదిర్చాం,' అని ఒక్క నిట్టూర్పు విడిచా రాయన. 'సలక్షణమైన పిల్ల లక్ష్మి దేవిలా ఉంటుంది. ఈ వయసులో ఆ అమ్మాయికి పెళ్లిమీద ఈ విముఖత ఏమిటో!-అమ్మాయి తల్లీదండ్రీ చెప్తుంటే కళ్లు చెమర్చాయనుకో బాబూ. ఎప్పుడూ విరక్తిగా ఉంటుందిట. ఏదో సినిమాకనీ...షాపింగు కనీ బయటికి పంపిద్దామన్నా వెళ్లదట. అథవా వెళ్లినా అన్యమనస్కంగా ఉంటుందిట. ముచ్చటగా కాపరం దిద్దుకోవలసిన పిల్ల...ప్చ్ ఏవిటో... ఒక్కొక్కళ్ల జీవితాలు ఎలా వెళ్లవలసి ఉన్నాయో ఎవరూ చెప్పలేరుకదా' అంటూ మరో నిట్టూర్పు వదిలి చొక్కామీద అంటుకున్న పండురసం కండువాతో తుడుచుకుంటూ లేచారు నా మనసు భానుమతిని చూడటానికి ఉరకలువేసింది. లోపలికి వెళ్లేసరికి ..మా ఆవిడకని కేటాయించబడిన గదిలోనుండి ఓ అప్సరస వస్తూండటం చూసాను. వాసు చెప్పిందాని కన్నా ...నే ననుకున్న దానికన్నా అందంగా వుంది ఆ అమ్మాయి. పైగా ఆ అప్సరస నన్ను తదేకంగా చూస్తూ ... కళ్లల్లోఆశ్చర్యం ... అరాధనా . ఆవేదనా మొదలైన రంగులన్నీ మార్చుకుంటూ వెళ్ళిపోయింది. ఈ అమ్మాయే కాబోలు భానుమతి అనుకున్నాను. వెంటనే ఈ అమ్మాయి నెక్కడో చూసినట్టుంది అని కూడా అనుకున్నాను. అయితే అందమైన అమ్మాయి కనిపించినప్పుడు ఎక్కడో కనిపించినట్టుండటం అందరికీ పరిపాటే. కాని నాకు మాత్రం నిజంగా ఎక్కడో చూసినట్టుంది.

మళ్ళీ తిరిగి వీధిలోనికి వచ్చి అరుగుమీద కూర్చున్నాను భానుమతి రూపం జ్ఞాపకం తెచ్చుకోవడానికి ప్రయత్నించాను. అందీ అందనట్టు జ్ఞాపకం వచ్చింది.

నేను బీకాం అయితే పాసయిపోయాను కాని ఉద్యోగమేదీ దొరకటం లేదు. స్టేట్‌బేంక్‌లో ప్రయత్నిస్తూ అప్పుడే మూణ్ణెల్లయింది. ఈలోగా వాసు తండ్రిగారే... 'ఎందుకూరికే కూర్చోవటం... మావూళ్ళో మున్సిపల్ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో లీవ్ వేకెన్సీ ఒహటుంది... నామోషి అనుకోకపోతే చెయ్యరాదూ' అన్నారు.

నాకు చాలా ఉత్సాహం కలిగింది. చిన్న పిల్లల మధ్య మెలగుతూ వాళ్ళ మెత్తని మనస్తత్వాల్తో అన్నెల్లయినా హాయిగా ఉందాం అనుకుని వెంటనే ఒప్పుకున్నాను. తత్ఫలితంగా స్టేట్‌బేంక్ ఉద్యోగం వచ్చేవరకూ చెయ్యడానికి నిశ్చయించుకుంటూ హయ్యర్ ఎలిమెంటరీ స్కూల్లో చేరాను. అయిదో తరగతి నాకిచ్చారు. అంతా పది పన్నెండేళ్ళ వయసులోని పిల్లలు. అంటే ప్రపంచమంటే ఏమిటో అర్థం అయీ అవని వయసు. నాది కూడా అట్టే వయసుకాదు. ఇరవై సంవత్సరాలైనా నిండని యువకుణ్ణి.

నా క్లాసులో ఓ అమ్మాయి నన్నెక్కువ ఆకర్షించింది. ఆ అమ్మాయే భానుమతి. రెండు మూడు నెలలు గడిచేసరికి నా క్లాసులోని పిల్లలకు నేనెంత ప్రియమైనవాణ్ణి అయ్యానో చెప్పలేను. క్లాసులోని అందరితోనూ చనువుగా వరసలు కలిసి ... మావయ్యా ... తమ్ముడూ ... అక్కయ్యా ... చెల్లెమ్మా ... పెద్దమ్మా ... చిన్నమ్మా ... అంటూ పిలుస్తుంటే స్కూల్లో ఏ మేష్టారికి ఇవ్వని ఆప్యాయత నా కిచ్చేవారు పిల్లలు

తరువాత కొన్నాళ్ళకి బాగా గమనించిన తర్వాత తెలిసిన విషయమేమిటంటే ... భానుమతి రోజూ నేను పాఠం చెప్పేటప్పుడూ, కబుర్లాడేటప్పుడూ తన ఇంతింత కళ్ళను అంతంతలు చేసుకొని చూస్తుందనీ ... రోజూ స్కూలు టైముకు ముందే వచ్చి నాకోసం గేటు దగ్గర కాచుకుని ఉంటుందనీ ... స్కూలు విడిచిన తర్వాత గూడా, నేను తీసుకున్న రూమూ... భానూవాళ్ళ ఇల్లూ దగ్గరే కావటంవల్ల ... నా కోసం ... నాతో రావటానికి స్కూలు బయట వెయిట్ చేస్తుందనీ తెలిసాయిగాని ఆ అమ్మాయి ఎఫెక్షనుకు అవధులెక్కడో తెలియ లేదు నాకు.

ఓ రోజు ఓ అమ్మాయి అడిగింది...

'మేస్టారూ ... మీరందర్నీ వరసలు పెట్టి పిలుస్తారుగానీ ... భానుని పిలవరెందుకండీ?'అని. అంతవరకూ నేనే ఆబ్జర్వ్ చెయ్యని విష యాన్ని పిల్లలంత సునిశితంగా పరిశీలించినందు కాశ్చర్యపోయాను.

'ఎందుకు పిలవటంలేదూ ... భానూ అని పిలవటంలేదూ ... ఏం భానూ ?' అంటూ ప్రక్కనే ఉండి వింటున్న భాను నడిగాను. అవునన్నట్టుగా తలూపింది భాను.

'కాదు. మాకు తెలుసు. ఆమె మీకు యిష్టం అవునా ?' అంటూ కిలకిల నవ్వుతూ పారిపోయిందా అమ్మాయి.

'అవునా ?' అనడిగాను భానువంక చూస్తూ. నా కళ్ళల్లోకి నిర్మ లంగా చూసి కళ్ళు దించుకుంది భానుమతి. 'ఛీ పోండి' అంటూ అందరి ఆడపిల్లల్లా పారిపోతుందని అనుకున్న నా మతి స్తంభించిపోయింది... ఆ పన్నెండేళ్ళ అమ్మాయి చేసిన భావ ప్రకటనకి.

తరువాత మరి రెండు నెలలకు నాకు స్టేట్‌బేంక్‌లో ఉద్యోగం రావటంతో నేను మేస్టరుగిరీకి రాజీనామా ఇచ్చి ఆ వూరు విడిచిపెట్టేసాను.

అప్పటి ఆ భానుమతీ ... వాసూ, వాళ్ళ నాన్నా చెప్పిన ఈ భానుమతీ జ్ఞాపకం వచ్చేసరికి నా మనస్సదోలా అయిపోయింది. వాళ్ళ అమ్మా నాన్నా నాకు అప్పుడు పరిచయం అవ్వటంవలన వాళ్ళని ఒకసారి కలుసుకోవాలన్పించింది.

మర్నాడుదయం చుట్టాలందరికీ భోజనాలట. తెల్లవారిం దగ్గర్నుండే మహా హడావుడి పడిపోతున్నారు విడిదిలో. అంచేత అక్కడుండేకన్నా అలా పెళ్ళి కూతురి ఇంటికి వెళ్ళి వాళ్ళ అమ్మా నాన్నలను చూసివద్దామన్పించి బయల్దేరాను. ఆ ప్రక్క వీధిలోనే వాళ్ళ ఇల్లు. పైనేవున్న రంగనాథంగార్ని నేనూ, నన్ను రంగనాథంగారూ వెంటనే పోల్చేసుకున్నాం.

'ఏవండోయ్ మేస్టారుగారూ ...' అంటూ పిల్చేసరికి, ఎప్పుడో ఎనిమిదేళ్ళ క్రిందట చేసిన అర్నెల్ల మేస్టరు గిరీకి నేను వాళ్ళకి మేస్టారుగానే స్థిరపడిపోవడం గమనించి చిన్న నవ్వు నవ్వుతూ...' ఇంకా మేస్టార్నేవిటండీ' అన్నా.

'స్టేట్‌బేంక్‌లో పన్జేస్తున్నారట కదూ... రండి రండి ఓ గడియ కూర్చుందురుగాని, వాసు మీ ఫ్రెండట. మేస్టారిలా వచ్చారూ అని భాను చెప్పిందిలెండి, ఆఁ... ఏవిటి సంగతులు?' అని ఆప్యాయంగా అడిగారు రంగనాథంగారు.

ఎప్పుడెలా పసిగట్టిందో ఓ ప్లేటులో స్వీట్సూ, ఓ కప్పుతో కాఫీ పట్టుకొస్తూ 'తీసుకోండి మేస్టారూ' అంది భానుమతి. తలెత్తి

చూసాను. నవ్వుతూ నిల్చున్న భానుమతి అప్సరసలా కనిపిస్తూందని ఎన్నోసారి అనుకున్నానో గుర్తులేదు నాకు.

'ఏం భానూ ... మీ ఆయనెక్కడ?' అన్నాను ఊరికే. చెమర్చిన కళ్ళు దించుకున్నట్టు గుర్తు. తర్వాత మరో క్షణాని కక్కడలేదు భానుమతి.

భానుమతి వెళ్ళిపోయిన ప్రక్క చూస్తూ నిట్టూర్పు విడిచారు రంగనాథంగారు. 'ప్చ్...పిచ్చిపిల్ల. బంగారబొమ్మలాంటి పిల్ల కాపరం చేసుకుంటూ వుండవలసిన వయసులో ఇలా ఇంకా పుట్టింటే వుంది మేస్టారూ. ఏం చెప్పను పెళ్ళి కాకుండా ఇంట్లో వుండటం నాకు బరువనికాదు. కాని అచ్చటా ముచ్చటా తీర్చుకుంటూ హాయిగా ఉండ వలసింది. ఇల్లు వదలకుండా తనలో తను మథనపడిపోతూందే అని నా బాధ. ఇదిగో చెల్లి పెళ్ళి కదా ... పిలుపులకైనా ఎక్కడికీ వెళ్ళ లేదు. నిన్న మాత్రం మీరు వచ్చినట్టు తెలిసి విడిదింటికి వెళ్ళింది అంతే.'

నాకు నేనే ముద్దాయిలా అనిపించాను. మౌనంగా విన్నాను.

'చూసారా మీరు మీ పెళ్ళి శుభలేఖ పంపించారు ... ఆ సంవత్స రమే భాను పెళ్లి చేసేద్దామనుకున్నాం. ఓ మంచి సంబంధం కూడా వచ్చింది. కాని భానుయే ఒప్పుకోలేదు. ఆ సంవత్సరంనుండి మరీ యోగినిలా మారిపోయింది' అంటూంటే రంగనాథంగారి గొంతు గద్గదమైపోయింది.

'ఎన్నోసార్లు అడిగాను మేస్టారూ...పోనీ నువ్వెవరినైనా ప్రేమిం చావా చెప్పు తల్లీ, అతన్ని ఎక్కడ ఉన్నా తెచ్చి చేస్తాను అని ' 'ఆ స్థితి దాటిపోయింది నాన్నగారూ ... నా పెళ్ళి గురించి మీరేం

బెంగపెట్టుకోకండి' అని చెప్పేసి తన గదిలోనికి వెళ్ళిపోయింది మేస్టారూ'

రంగనాథంగారి మనస్సూ బరువైనట్టుంది ఆపేసారు. అది సరేలేగాని మీ ఆవిడా పిల్లలూ వచ్చేరుట. ఓసారి తీసుకురాగూడదటండీ మేస్టారూ. అక్కగారు అక్కగారు అని మీ ఆవిడ సంగతీ... బాబు అచ్చం మేస్టారి పోలికేనని ఊరికే మురిసిపోయి చేప్తోంది వాళ్ళమ్మతో..' అన్నారు రంగనాధంగారు.

'అలాగేనండీ' అన్జెప్పి చాలా పొద్దుకావటం మూలాన లేచాను.

'మరి వెళ్లొస్తానండీ ... అమ్మగారితో చెప్పండి ... భాను ..' అని ఆపేసాను నేను. 'భానూ' అంటూ రంగనాథంగారు కేకేసేసరికి భానుమతి పరుగెత్తుకు వచ్చింది.

'వెళ్లొస్తా భానూ' అన్నా.

ఆ కళ్ళళ్ళో ఏవేవో భావాలు నీడల్లా కదులాడుతున్నాయ్. వెళ్ళిపోతారా' అన్నట్టుగా చూస్తున్నాయ్.

విడిదింటికి వచ్చేస్తూ వీధి మలుపు తిరుగుతూ వెనక్కి చూసాను. మంగళ వాద్యాలు ఉచ్చంగా మొదలైనాయ్ వాళ్లింట్లో.

ఆ ఇంట్లోనుండి ... ఆ కిటికీలో నుండి తడితో తళతళలాడుతున్న అంతంతలున్న భాను కళ్ళు ఇక్కడికీ కన్పిస్తున్నాయ్ నాకు.

(ఆంధ్ర పత్రిక)